# కాత్యాయని

"నిన్ను కోరి కోడల్ని చేసుకొన్న వాళ్ళకు చెయ్యి సేవలన్నీ. నా గదిలోకి రావద్దనెన్ని సార్లు చెప్పాను? ఎందుకు నా పుస్తకాలన్నీ అలా కెలుకుతావు?"

బాణాలవంటి ఆ మాటలకు ఉలిక్కిపడి వెనుదిరిగి చూచింది కాత్యాయని. తీక్ష్ణంగా మింగేసేట్టు చూస్తూన్న శ్రీనివాసరావు మొగం లోకి చూడలేక తలవాల్చి మెల్లగా సమాధానమిచ్చింది, "మీకు కాలేజికి టైమవుతూంది. పుస్తకాలు తీద్దామని."

"ఆఁ ఆఁ. ఉద్ధరిస్తావు. అల్మారాలో ఉన్నవన్నీ నెత్తి నెట్టుకు వెళ్ళమంటావా? పల్లెటూరి మొహం. టైంటేబుల్ తీయడం కూడాను బ్రతుక్కి." ఆ చీకాకులో పుస్తకాలన్నీ అటూ ఇటూ గిరవాటేయడం మొదలెట్టాడు శ్రీనివాసరావు.

ఏం చేయాలో ఏం మాట్లాడాలో తెలియక వస్తూన్న దుఃఖం ఆపుకుంటూ నిల్చుంది కాత్యాయని.

"ఏం జేస్తున్నావే కాత్యాయనీ?" అత్తగారి అంకవిని గబగబ కళ్ళు తుడుచుకుంటూ బయటకు వెళ్ళింది.

"పిల్చారా అత్తయ్యా?" మెల్లగా అడిగింది అత్తగారి దగ్గర నిల్చుని కాత్యాయని.

"అబ్బే. ఎందుకుపిలుస్తాను? హాయిగా రాత్రనక పగ లనక గదిలో దూరి కూర్చోమంటాను... ,,సిగ్గులేక ఇంకా నిల్చుని అడుగుతున్నావా? ఇలా అయితే వాడి చదువు సాగినట్టే. ఆ పద్మకీ, రమణకీ స్కూలుకైమైంది. అన్నాలు పెట్టు. వాడికి కాలేజీకైమైంది. ఇక వెళ్ళనియ్యి."

"కాలేజికి వెళ్తున్నారు. ఏం కావాలో కనుక్కుందా మనే వెళ్ళాను. ఇంతవరకూ ఇక్కడపని చేస్తూనే వున్నానుగా అత్తయ్యా?" చాలా మెల్లగా అన్నది కాత్యాయని. దానితో రుక్మిణమ్మ కోపం రెచ్చిపోయింది.

"ఓ యమ్మ! ఎదురు సమాధానాలు కూడా వచ్చు నటే నీకు చిలకతల్లీ? ఇంకా యేమో పల్లెటూరి దానవను కున్నాను. ఇదిగో చూడు. నువ్వు గొప్పింటి పిల్లవే కావచ్చు నీ అమ్మకి ఒక్కగా నొక్కకూతురివై గారాబంగా పెరిగితే పెరిగి ఉండచ్చు-నాకు మాత్రం కోడలివే. ఇక్కడేమీ పది మంది నౌఖర్లులేరు. చచ్చినట్టు అన్ని పనులూ చేయాల్సిందే తెలుసా?"

"నేను చేయనన లేదు కదండీ!" విస్మయంతోనే అడి గింది కాత్యాయని.

"నోరు మూసుకునిపోయి, చెప్పినపనిచెయ్యి. భర్తే మిటి - పిల్లలేమిటి? ఈ నాటికి ఒక్కళ్ళు నన్నెదిరించి ఎరు

గదు. ఇన్నాళ్ళను నువ్వు బయలుదేరావన్నమాట! నీ ఆట లేమీ ఇక్కడ సాగవు. దాసీదాని కెంత విలువో నీకూ అంతే తెలుసా?" గర్జించింది రుక్మిణి.

అవి మాటలో తూటాలో, ఎదుటనున్నది మనిషో రాక్షసో, అసలంతంత మాటలనడానికి కారణమేమిటో తెలియక ఆశ్చర్యంతో అవమానంతో శిలా ప్రతిమలా నిల్చుని పోయింది కాత్యాయని.

"అమ్మతో నాదులాడుతూ కూరోచ్చవడమేనా, నాకేమైనా కాస్త అన్నం పెట్టేదుందా? వెళ్ళి పొమ్మంటావేమిటమ్మా వదినా?" అధికారంగా అడిగింది ఆడబిడ్డ పద్మ.

"కూరోచ్చమ్మా పెట్టాను." కన్నీళ్ళు తుడుచుకుంటూ వడ్డన కుపక్రమించింది కాత్యాయని.

"దరిద్రగొట్టు మొహమూ. ఏమంత ఆపద వచ్చిందని ఆ యేడుపు? ఏడుస్తూ నా పిల్లల కన్నం పెట్టక్కర్లేదు. వెళ్ళి ఆ కుళాయి దగ్గర చెంబులున్నాయి. తోమి తీసుకురా." అని ఆజ్ఞాపించింది రుక్మిణి.

కళ్ళు ఒత్తుకుంటూ వెళ్ళిపోయింది కాత్యాయని.

*　　　*　　　*

"నిన్న సాయంకాలం వచ్చావో లేదో అప్పుడే ఎందుకమ్మా నీకీ పనులన్నీ? అయినా పనిమనిషేమైంది?" మామగారి కంఠం విని చెంబులు తోముతూన్న కాత్యాయని లేచి నిల్చుంది. ఆమె ఏదో సమాధానం చెప్పేలోగానే ఎటు

నుండో వచ్చిన రుక్మిణమ్మ అందుకుంది. "ఏమీ ముద్దుల కోడలు మరేమీ అలసి పోవడంలేదు. వెళ్ళి భోజనం చేయండి వడ్డించాను. అయినా మీ కెందుకు ఇంట్లో ఆడవాళ్ళ గొడవలు?"

మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు ఉమాపతి.

రుక్మిణమ్మ ధ్యాస కోడలిపైకి త్రిప్పింది. "అయితేనూ మామగారి ఎదుట అలా గెడకర్రలా నిల్చుంటావేమే కాత్యాయనీ? మామగార్లకీ బావగార్లకీ కన్పించడం మా యింటా వంటా లేదు."

"వారి రాకను నేను గమనించలేదండీ. అయినా తండ్రిగారెంతో మామగారంతకాదా?" అమాయకంగా ప్రశ్నించింది కాత్యాయని.

"నోర్మూయ్. ఆ ఎదురు సమాధానాలే వద్దన్నాను. చెప్పినట్టువిని చచ్చినట్టుండు... ఎంతసేపు తోముతావు ఆ వెధవ నాలుగు చెంబులు? త్వరగా రా. వంటింట్లో ఎంగిళ్ళెత్తి కంచాలు కడగాలి." రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది రుక్మిణి.

మౌనంగా అనుసరించింది కాత్యాయని, కడిగిన చెంబులు చేత్తో పట్టుకుని.

అందరి భోజనాలూ అయిన తర్వాత, పనంతా పూర్తిగా చేయించుకుని, అప్పుడు మొక్కుబడిగా కాత్యాయనికి అన్నం వడ్డించింది అత్తగారు, ఆ క్రితదినమే క్రొత్తగా ఆ ఇంట్లో అడుగుపెట్టడం, భర్త అనాదరణ, అత్తగారి అన

వసర ఆదరింపులు క్రొత్తగా అనుభవిస్తూన్న కాత్యాయని - అందునా మ్రింగేసేట్టు చూస్తూ నిల్చున్న అత్తగారి ఎదుట సరిగా భోజనం చేయలేకపోయింది; తినీ తినకుండా లేచి పోయింది. అందుకై రుక్మిణమ్మకేమీ జాలి, దయకలుగనే లేదు. ముఖ్యమైన గదులు తాళం వేసుకుని, కోడలికి ఇల్లు జాగ్రత్త, అని చెప్పి పొరుగిళ్ళకు పెత్తనాలకు వెళ్ళి పోయింది.

* * * *

తన ముఖమైనా చూడని భర్త. బండెడు చాకిరీ నెత్తిన పెట్టి నిష్కారణంగా దూషిస్తూన్న అత్త, అధికారం చెలాయించే మఱదులూ ఆడపడుచులు—వచ్చిన మర్నాడే ఈ విధంగా వుంటే ఇక ముందెలా వుంటుందో తన మనుగడ ఈ ఇంటిలో! సినిమాల్లో గయ్యాళి అత్తగార్లను చూచి హాయిగా నవ్వేది; మళ్ళీ మళ్ళీ చూచి వినోదించేది. కాని అత్తగారు, కాపురం అంటే తెలియని రోజులవి. ఇప్పుడు సినిమానుమించి పోయింది అనుభవం. నవ్వే శక్తిని హరించివేసింది.

ఆలోచించుతూన్న కాత్యాయని సైకిల్ బెల్ విని తలెత్తి చూచింది. శ్రీనివాసరావు కాలేజీనుంచి వచ్చాడు. సగం సంతోషంతో, సగం బెదురుతో లేచి వెళ్ళి కాఫీ ఫల హారాలు ఇచ్చింది. కాని అతడు వాటిని కన్నెత్తికూడ చూడ కుండ ఇల్లూ దొడ్డి అంతా కలియ వెదికాడు. బాధతో అవమా నంతో తలవాల్చి నిల్చుంది కాత్యాయని.

అప్పుడే స్కూలునుంచి వచ్చిన పద్మను, "అమ్మ ఎక్కడుందో చూచి తీసుకురావే" అని ఫర్మాయించాడు శ్రీనివాసరావు.

రుక్మిణమ్మ వచ్చి కొడుకునూ, కోడల్ని పరిశీలనగా చూచింది. క్షణంలో గ్రహించేసింది పరిస్థితి. భార్యా భర్త లిరువురి మధ్యనా సఖ్యతానోన్యన్యతలు లోపించాయన్న మాట! "ఇంకేం, తన అధికారానికి అసలే తిరుగులేదు!"

"అయితే మొగుడికికాస్త అన్నం పెట్టుకోవడం, కాఫీ ఇచ్చుకోవడం కూడా చేతకాదన్నమాట? ఇంకెందుకే, నాపై సవారు చేయడానికా?" బుగ్గలు నొక్కుకుంటూ అడిగింది — త్యాయనిని.

కాత్యాయని మౌనంగా గదినుండి నిష్క్రమించింది.

"నా కొద్దు మొఱ్ఱో అన్నాడమ్మా బిడ్డ. నేనే కట్ట బెట్టాను ఈ మూగిమొద్దుని." ముక్కు చీదుతూ దీర్ఘాలు తీసింది రుక్మిణి.

*　　　*　　　*

అప్పుడే అరుణోదయమైనది.

ఏదో పని వుండి వంటగదిలో వున్న కాత్యాయని, దొడ్లోకి వస్తూవస్తూ ఏవో గుసగుసలు వినరాగా ఆగిపోయి, వెనక్కు తగ్గి శ్రద్ధగా వినసాగింది.

"అయితేనూ ఇంకా లేవలేదటూ రుక్మిణీ క్రొత్త కోడలు?" మందస్వరంలో విడ్డూరంగా ప్రశ్నిస్తూంది ప్రక్కింటి వెంకాయమ్మ.

"హుఁ ఏం చెప్పనమ్మా?" ఏదో మహానర్థం వాటిల్లినట్లు నుదురు కొట్టుకుంది రుక్మిణి. "వాడు చదువుకున్న పిల్ల కావాలో అని గోలెట్టినా వినకుండా దాన్ని కట్టబెట్టాను. చదువుకున్నదైతే ఏ పనీ చేతకాదు; తొమ్మిది గంటలకు నిద్రలేస్తుంది — దాని కెదురు మనమే చేయాలి. ఇలాటి పల్లెటూరి ముండ అయితే నోరుమూసుకు పడివుంటుంది— ఏపని చేయమన్నా, కడకు కొట్టినా తిట్టినా అనుకున్నాను... అయినా ఖర్మ! ఒక్క పనిచేతకాదు. ఒక్కతేకూతురు కదూ, దున్నపోతులా పెరిగించేమో మరి గారాబంగా? చూచావా యింకా నిద్రలేవలేదు. అత్తింటి కోడలు!"

"పనెందుకు లేవమ్మా చక్కగా యాభై వేల కట్నం తెచ్చిపోసింది. మా కోడలూ వుంది ఎందుకు? బోడిబొమ్మలా వచ్చి నిలుచుంటుంది. ఎంత చాకిరీ చేస్తే మాత్రం ఎందుకు? ధనంసాటి వస్తుందా?......అయినా బాగా అదుపులో పెట్టు కోడల్ని. యింకా నిద్రలేవక పోతే ఎలాగ?"

"కాదు మరీ? నేను వదలిపెడ్తానా దాన్ని? వారం తిరిగే సరికి దాన్లోకి తెచ్చేయనూ?"

"అది సరేకాని, ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. ఒక్క కుంచెడు ఇస్తావేమిటి? ఓ అర్థరూపాయిస్తాను."

"దానికేం: అలాగే పట్టుకెళ్ళు. అయితే డబ్బు తెచ్చావా?"

"ఇదుగో. ఆరణాలు, మిగిలినది తర్వాత సర్దుతానులే?"

"అలాగే......ఇదిగో బియ్యం. త్వరగా తీసుకుపో. ఎవరైనా చూస్తారేమో?"

చాటునుండి వింటూన్న కాత్యాయని వెలుపలికి వచ్చింది, "ఏమిటామాటలు. వెంకాయమ్మగారూ ?" అంటూ.

కంచుగంట లాంటి కాత్యాయని కంఠం, వింటూనే వెంకాయమ్మ ఒడిలోమూట కడుతూన్న బియ్యం జారవిడిచింది.

రుక్మిణమ్మ కొంగున కడుతున్న డబ్బులు జార విడచి నివ్వెరపోయి నిలుచుంది.

"ఏమిటండీ వెంకాయమ్మగారూ మీరు చేసేపని? అత్తగారికి కోడలికీ మధ్య తంపులెట్టి మీబాగు మీరుచూచుకుంటున్నారన్నమాట? వెళ్ళండి. యింకెప్పుడైనా ఈ గడప తొక్కారా-మర్యాద దక్కదు. మీ డబ్బులు మీరు పట్టుకు పోండి. ఊఁ కదలరేం?" ఉరిమింది కాత్యాయని.

వంగి, చెల్లాచెదురై పడిపోయిన డబ్బులు ఏరుకొని సాగింది పొరుగామె.

అప్పటికి కాస్త నివ్వెరపాటు నుండి తేరుకుని, ధైర్యం సంతరించుకున్న రుక్మిణమ్మ కోడలి మీదికి తారా జువ్వలా లేచింది.

"నీ కెన్ని గుండెలే, నా యింట్లో నాపైనే అధికారం చేస్తున్నావు? ఏం ఈ యింట్లో కాపురం చేసే ఆశ లేదా నీకు?"

కాత్యాయని బెదరలేదు; తేరిపార చూచింది అత్త గారి వైపు.

"అందరికీ భగవంతుడెన్ని గుండెలిచ్చాడో నాకూ అంతే. కాని అత్తగారూ, మీరు చేస్తూన్న పనేమిటో ఒక్క సారి తెలివిగా ఆలోచించి చూడండి. నేను తెల్లవారు ఝామున నాలుగంటలకు లేచి స్నానం, పూజ ముగించుకున్నాను కాఫీ, టిఫిన్‌లు తయారుగా చేసివుంచాను. వంటప్రయత్నంలో వున్నాను.

"మీరు యిప్పుడు లేచి పైగా, కోడలింకా నిద్ర లేవ లేదని పొరుగావిడతో చెప్తున్నారు. ఆవిడ స్వలాభం కోసం మరో నాలు పుల్లలు వేస్తోంది. యిట్టిగుట్టు పరులకు చెప్పు కోవడం మనకే హానీ, అపకీర్తి, రెండు రూపాయలు చేసే విలువైన బియ్యం ఒక అర్ధకో అర్ధాలకో ఆవిడకు పోసేస్తున్నారు. ఇల్లుగుల్ల చేసే ఇటువంటి పనులెవరికి నష్టం? ఇంటికి దీపమైన ఇలాలే ఇల్లుగుల్ల చేయడమా?" నిగ్గదీసి ధైర్యంగా అడిగింది. కాత్యాయని.

నిన్నగాక మొన్నవచ్చిన కోడలు తన 'దొంగతనం పట్టేయడం, పైగా సన్నసన్నగా చీవాట్లు తిన్పించడంచూస్తే రుక్మిణమ్మకు కోపం, ఉడుకుమోత్తనం మిళితమై నిప్పు త్రొక్కిన కోతిలాగై పోయింది. అదీగాక గడచిన వారం రోజులూ నోరూ వాయీ లేక, బండచాకిరీ అంతా చేసి, తిట్టిన తిట్లన్నీ మూగగా సహించిన పిల్ల ఈరోజు ఇంత ఖరోడాలాగై పోయిందేమా అని ఒక ప్రక్క విపరీతమైన ఆశ్చర్యం కల్గు

తోంది. దానితో అతి రహస్యం బహిరంగమై పోతుందనే జ్ఞానం కూడా లేకుండా తోకత్రొక్కిన త్రాచులా లేచింది కోడలిపైకి.

"ఔరా! ఈ నాటికి భర్త, పిల్లలు ఒకరైనా నామాట నెదిరించి ఎరగరే? నువ్వెంత దానవే నాకు నీతులు నేర్ప డానికి? ఆరిపోయేముందు దీపం నీలాగే ఎగిరెగిరి పడ్తుందట. నడు బయటికి. నీ దిక్కున్నచోట చెప్పుకో. నా యింటిలో ఒక్కక్షణం వుండకు, నడు." బయటికి దారిచూపిస్తూ గావు కేక లెట్టింది రుక్మిణమ్మ.

తేలికగా నిర్లక్ష్యంగా ఒక్క నవ్వు నవ్వింది కాత్యా యని. "మీ తెలివితక్కువతనానికి జాలివేస్తోంది అత్తయ్యా. రమ్మనేవరకే మీ ఇష్టంకాని పొమ్మనడానికి మీరెవరు? ఒక నాడు మీరేవిధంగా కోడలై ఈ యింటికి వచ్చారో, నేనూ ఈనాడలాగే వచ్చాను. మీ తర్వాత ఈ ఇంటికి అధికారిణిని నేను. కోడల్ని కూడ కూతురిలాగే చూచుకుని గౌరవమిచ్చి గౌరవం నిల్పుకోవాలి కాని ఇటువంటి పరిస్థితులు రానీయ కూడదు."

"ఏమిటేమిటి? మెడబట్టి గెంటుతాను, మర్యాదగా పోకపోతే. ఉండు నీ మొగుడికే చెప్తాను పొగరణచమని" బెదిరించింది రుక్మిణి.

హేళనగా, అతి నిర్లక్ష్యంగా చూచింది కాత్యాయని. "అది మీకెవరికీ తరంగాదు. ఇంట్లో ఒకరు తప్పుత్రోవన

నడుస్తూంటే దిద్దే అధికారం ఎవరికయినా వుంటుంది. పెద్దా చిన్నా భేదం, అధికారాలూ మరచి మంచిని గ్రహించి, చెడును వదిలిపెట్టడంలోనే వ్యక్తి గౌరవం, కుటుంబ గౌరవం నిలుస్తాయి. ఆపైన మీ ఇష్టం. నాకు వంటింట్లో పనుంది" అంటూ వెనుదిరిగి ఇంట్లోకి పోబోయిన కాత్యాయని, నిర్ఘాంతపోతూ చటుక్కున రెండడుగులు వెనక్కు వేసింది.

ఏమో పెద్దగా అరవబోతూన్న రుక్మిణమ్మకూడ నోరు మూసేసుకుని ప్రతిమలా నిల్చుంది—కారణం, భర్త ఉమాపతి గుమ్మం నిలువునా నిల్చుని చూస్తున్నాడు. వదనంలో అస హన, క్రోధ రేఖలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎప్పటినుండి వింటున్నాడో మరి ఈ సంభాషణ?

మామగారి ఎదుట గౌరవంగా తలవంచి నమ్రతతో ప్రక్కకు ఒదిగి నిల్చుంది కాత్యాయని.

"ఏమిటే, ఇంకా తెల్లవారకుండానే ఈ గొడవంతా?" భార్యను ప్రశ్నించాడు ఉమాపతి.

అంతవరకూ వినోదం తిలకిస్తూన్న వెంకాయమ్మ గబ గబా ఖంగారుగా నడచిపోతూ నిష్క్రమించింది.

ఆమెనూ ఆమె చేతిలోని డబ్బులనూ పరీక్షగాచూస్తూ తిరిగి రెట్టించాడు ఉమాపతి: "ఏమిటి గొడవ?"

"ఏముందీ: అంతా మీ తెలివితక్కువా, మీరిచ్చిన అలుసే. నిన్న చెంబులుతోముతూంటే కోడలు అలసిపోతోం దని వగలుపోయారు మీరు, ఆ అలుసు చూచుకొని అది అప్పుడే నన్ను ధిక్కరిస్తోంది. నేను తిట్టినా మాట్లాడని మీరు

కూడా ఈనాడు నన్ను నిలదీసి అడుగుతున్నారా? అయ్యో భగవంతుడా! నా కొంపలో నాకే ఎన్నిపాట్లు తెచ్చిపెట్టావురా! ఇంకా నేనీ కాపురం చేయలేను తండ్రోయ్" ఆమె రౌద్రం, అహంకారం కన్నీటిగా రూపాంతరంపొంది, బిగ్గరగా శోకాలు పెట్టసాగించింది.

ఇటువంటి ప్రవర్తనలు, శోకాలు, విపరీతాలూ ఎరుగని ఉన్నత సంస్కార కుటుంబంనుంచి వచ్చిన కాత్యాయని విస్తుపోతూ చూస్తోంది అత్తగార్ని.

"నోరుమ్మోయ్. సిగ్గుచేటు" అని భార్యను మందలించి, "ఏం జరిగిందమ్మా కాత్యాయనీ? ఆ బియ్యమేమిటి? నువ్వు ఒలకపోశావా?" అని ప్రశ్నించాడు ఉమాపతి.

ఒక్కసారి కళ్ళెత్తి మామగారివైపు చూచి, తిరిగి వాల్చేసింది కాత్యాయని. 'నిన్న మామగారి ఎదుట నిల్చున్నందుకే కోపపడింది అత్తగారు. ఇక యిప్పుడు మాట్లాడితే ఇంకేమంటుందో!'

సందేహిస్తూ బెదురుస్తూ రుక్మిణమ్మను చూస్తూనిల్చుంది కాత్యాయని.

"ఫర్వాలేదమ్మా. చెప్పు" రెట్టించాడు ఉమాపతి.

ఈసారి కాత్యాయని ధైర్యంగా చూచింది మామగారివైపు.

"మీ అంతవారికి చెప్పేపాటి దాననుకాను. కాని పరిస్థితి అటువంటిది – క్షమించండి. చూచారుగా వెంకాయమ్మ

గారినీ, ఈ బియ్యాన్నీ ని?......స్త్రీల చేతికి డబ్బుదొరకని నిరంకుశ సంసారా లన్నీ ఇలాగే అధోమార్గాన పడ్డాయి. కుటుంబౌన్నత్యం, హైన్యతలతో నిమిత్తంలేదు దీనికి. మగ వారు ఈ విషయాలు తెలిసి తెలివిగా ప్రవర్తించాలి." అంటూనే కాత్యాయని చకచకా అక్కడినుంచి వెళ్ళి పోయింది.

నిర్ఘాంతపోయాడు ఉమాపతి. "ఏమిటీ? యాభై ఏళ్ళు నెత్తికొచ్చిన తనను — ముప్ఫై ఏళ్ళుగా కాపురం చేస్తూన్న తనను, ఇరవై ఏళ్ళయినా నిండని కోడలిపిల్ల తెలివిగా సంసారం నిర్వర్తించమని సలహా ఇవ్వడమా?" కాత్యాయని వెళ్తూన్నదిక్కే చూస్తూండిపోయాడు ఉమాపతి, రుక్మిణమ్మకు సందు దొరికింది. "చూచారా ఎంత పొగరెక్కిపోయిందో అది: మిమ్మల్నే వెక్కిరిస్తోంది!" అన్నది రొప్పుతూ.

కోడల్ని మందలించుదామని వెడుతున్న ఉమాపతి ఏదో ఆలోచన రావడంతో ఠక్కున ఆగిపోయాడు. 'కోడలు చిన్నపిల్ల. నేను పెద్దవాడిని ఎందులో? బుద్ధిలోనా? ఇన్నాళ్ళుగా అనేకమంది నన్నూ, నా కుటుంబాన్నీ నవ్వి హేళన చేస్తున్నారు. కారణం నాకుతెల్సు. కాని నివారణోపాయం? అది తెలియకేగదా ఇంత వరకూ వచ్చింది: కుటుంబ పరిస్థితి కారణం, నివారణోపాయం—అన్నీ కలిపి ముక్తసరిగామూడు మాటలలో సౌమ్యంగా చెప్పింది. అ నా నా బలవం తంపై !

'తెలివైనదీ, కుటుంబక్షేమం కోరినదీ గనుక ధైర్యం చేసి చెప్పింది—అదీ అతి సౌమ్యంగా, ఎవరిపైనా నిందారోపణలు లేకుండా, ఎవరినీ పేరెత్తకుండా జనాంతికంగా మాట్లాడింది. ఆమెపై ఆగ్రహించడం అపరాధం. పిన్నవారినుంచైనా సరే మంచిని పెద్దలు సిగ్గుపడకుండా స్వీకరించిన నాడే భూతలం స్వర్గతుల్యమౌతుంది. లాభనష్టాలు, పరువు మర్యాదలు ఆలోచించకుండ ఇంట్లోని సరకులు భార్య ఆవిధంగా చాటు మాటున అమ్ముతుందంటే కారణం తానామె చేతికి డబ్బు దొరకనీయ పోవడమేగా? కుటుంబం అన్నతర్వాత అనేక ఖర్చులుంటాయి. పైకి కన్పించవు. ప్రతీదీ చెప్పాలంటే చెప్పేవారికీ కష్టమే, అంతటి కుటుంబాన్ని, గృహాన్ని దిద్దే బాధ్యతగల వ్యక్తికి అందు నిమిత్తమయ్యే డబ్బు మీదకూడ కొంత స్వతంత్రం వుండాలి." అనుకొంటూ వంటగదివైపు నడిచాడు ఉమాపతి.

వంటయింట్లో పద్మా, రమణ కాత్యాయనిపై అధికారం చెలాయిస్తున్నారు.

"ఏం వదినా? మేం లేచి అరగంటపైగా అయ్యింది. ఇంత వరకు కాఫీనీళ్ళు లేవు మా ముఖాన" అది రమణ గొంతు.

"నేను కాఫీ టిఫిన్‌లు తయారుచేసి వుంచి మూడు గంటలుపైగా అయ్యింది. రావడం మీదే ఆలస్యం. కూర్చోండి. ఇస్తాను." మృదువుగా సమాధానం చెప్పి ఆడ

పడచు లిద్దరికీ కూర్చోవడానికి రెండు పీటలు వాల్చింది కాత్యాయని.

"ఓహూ!" హేళనగా ప్రారంభించింది పద్మ. "అయితే వదిన ఏదీ? వంటిల్లు ఎక్కడున్నదీ" అని వెతుక్కుంటూ రావాలన్నమాట మేము. ఎంత దర్జావచ్చిందినీకు? మా గదుల లోకి తెచ్చివ్వాలి రేపటినుంచీ, తెలిసిందా?" అధి కారపూర్వకంగా అన్నది.

చేస్తూన్న పని ఆపిలేచినిల్చుంధికాత్యాయని. వస్తూన్న కోపం ఆపుకుంటూ వీలైనంత సౌమ్యంగా మాట్లాడడానికి ప్రయత్నిం చింది.

"మాడండమ్మా, పద్మా. మీరు చిన్నపిల్లలు. మీకేం తెలియదు. మీరు పెరిగిన పరిస్థితులూ అటువంటివే. ఇవాళ నేను ఈ యింటికి వచ్చినట్లే మరో రెండేళ్ళుపోతే మీరూ పెళ్ళయి భర్త ఇంటికి వెళ్తారు. అక్కడ అత్తా, ఆడపడచులూ మరుదులూ ఇలా మిమ్మల్ని అగౌరవం చేస్తే మీ కెట్లా వుంటుంది? కూతుళ్ళూ కోడళ్ళూ సఖ్యంగా ప్రేమగావుంటేనే కుటుంబం శాంతంగా గౌరవంగా నిలుస్తుంది. నన్ను మీరు గౌరవిస్తే, మీపై నాకు ప్రేమ పుడుతుంది. అంతేకాని ఎందుకీ అక్కరమాలిన అధికారాలు? చదువుకుంటున్నారు కూడాను - ఆమాత్రం గౌరవంగా ప్రవర్తించడమే తెలి యదా?"

చెఱుకు చెడే రుచిస్తుంది కానిమంచి బాగుంటుందా?

వదిన చెప్పిన మంచి మాటలు వాళ్ళ చెవికెక్కకపోగా వదిన తమ కెదురు తిరుగుతున్నదనే అక్కసు అధికమై పోయింది వాళ్ళకు.

దానితో పద్మ తారాజువ్వలా లేచింది. "ఏమమ్మాయ్ నువ్వు పెద్ద జమీందారు రాయుడుగారి యేకైక పుత్రికవైతే కావచ్చుకాని, మాకేమీ లెఖ్ఖలేదు. అందాల అద్దాలమేడలో పుట్టి పెరిగానని విర్రవీగడానికి వీలులేదు. అత్తారింట్లోకొచ్చి నట్లు పడుండాల్సిందే. ఇదేమన్నా సినిమా అనుకుంటున్నా వేమిటి, అందంగా నాజూకుగా లెక్చర్లివ్వడానికి ? నువ్వు కాదు, నీ తాత దిగివచ్చినా మమ్మల్ని మార్చలేడు."

"పద్మా !" కాత్యాయని అదిలింపు విన్న పద్మా రవణలు ఉలిక్కిపడ్డారు.

"ఊరుకున్నకొద్దీ హద్దుమీరి మాట్లాడుతున్నావు జాగ్రత్త ! కేవలం నాపై అధికారం చెలాయించడం, నన్ను కించపరచడమే నీ ఉద్దేశ్యమైతే అది ఎంతమాత్రం సాగదని నిష్కర్షగా చెప్తున్నాను. అవిగో కాఫీ ఫలహారాలు. కిక్కురు మనకుండా బయటకుపోయి మీ పనులు చూచుకోండి. ఇంత కంటె మీతో అధికంగా మాట్లాడవలసిన అవుసరం నాకు లేదు" అంటూ తన పనిలో మునిగిపోయింది కాత్యాయని.

"చూడే అమ్మా ఈ వదినా" కళ్ళునులుపుకొంటూ, గారాబంగా ఏడుపు మొదలెట్టింది పద్మ.

"అమ్మ చూడక్కర్లేదు. అన్నీ నేనే చూస్తున్నాను."

ఉమాపతి కంఠం గంభీరంగావినిపించడంతో ప్రాన్పడి

పోయి ఏడ్పు మానేసి బిక్కముఖంతో నుంచుంది పద్మ. అక్క చాటున నక్కింది రమణ.

చేస్తూన్న పని వదలి లేచి నిల్చుంది కాత్యాయని.

"వదిన ఎలా మాట్లాడుతూన్నది ? నువ్వు మాట్లాడే తీరెలాగుంది ?" పద్మను తీక్షణంగా చూస్తూ ప్రశ్నించాడు ఉమాపతి. పద్మ వంచిన తలెత్తలేదు. "పెద్దవాళ్ళతో ప్రవర్తించవలసిన తీరు అదేనా ? మాట్లాడవేం పద్మా ? ఏం రమణా?" గర్జించాడు ఉమాపతి.

"కోడల్ని తిడతాడు—చూచి ఆనందించుదా" మనుకున్న భర్త వెనకాలే వచ్చిన రుక్మిణమ్మకు ఆశాభంగమై కోపం తారాపథాన్నంటింది.

"అవ్వవ్వ. ఎలాంటి మనిషెలా మారిపోయారు ! కోడలిని మందలించడం అట్టేపోయి, కూతుళ్ళను-పసిపిల్లల్ని హడలగొట్టేస్తున్నారా? అప్రతిష్ట !" బుగ్గలు నొక్కుకుంటూ రంగంలో ప్రవేశించింది రుక్మిణి.

తల్లిని చూడగానే బావురుమంటూ మీదపడిపోయారు పద్మా, రమణాను.

"ఊరుకోండమ్మా ఊరుకోండి. మహాతల్లి అడుగుపెట్టిందో లేదో అప్పుడే సంసారాని కెన్ని తిప్పలొచ్చాయిరా భగవంతుడా ? శోకాలెత్తూ ముక్కు చీదేయసాగింది రుక్మిణి.

అవమానంతో అసహ్యంతో, బాధతో భారంగా భూమిలోకి వాలిపోయింది కాత్యాయని తల. నోరు మెదపనంతసేపు చేయించే ఊడిగాలకూ, ఆడిపోసే మాటలకూ

అంతంలేదు. సరైన జవాబు చెప్పి జరుగుతూన్న రాద్ధాంత ఆపింది. ఇక ఏది దారి? ఆలోచనామగ్నమైన కోడలి ముఖాన్ని పరిశీలనగా చూస్తూ నిలబడ్డాడు ఉమాపతి.

అంతలో "ఏమిటి, ప్రొద్దున్నే ఈ గోల ?" అంటూ వచ్చాడు శ్రీనివాసరావు. కాని, అక్కడ తండ్రిని చూడగానే వెనుకను జంకి మాట్లాడకుండా అందరినీ పరిశీలిస్తూ నిలుచున్నాడు.

రుక్మిణమ్మకు కొడుకును చూడగానే వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

"చూడు నాయనా చూడు. నువ్వే చెప్పు. ఈ పసిపిల్లలిద్దరూ వచ్చి కాఫీ అడగడం తప్పా? మామా కోడలూ కలిసి ఇలా తిట్టి ఏడిపించేస్తున్నారు వాళ్ళని. ఈనాటికి మీరెవరైనా నన్నెదిరించి ఎరుగుదురా? ఇది యిక ఒక్కక్షణం ఈ యింట్లో ఉండడానికి వీలులేదు."

నీ యిష్టంవచ్చినట్లు కానియ్యి. ప్రతీదీ నా యిష్టప్రకారమే చేస్తున్నానా? నా ఇష్టమే వుంటే యిలాంటి మొగుణ్ణి కట్టుకొంటానా?" అంటూ వెనుదిరిగాడు శ్రీనివాసరావు, తనకా గొడవే అనవసరమైనట్టు.

"భూదేవీ, బిడ్డలుకావేం తల్లీ? నిష్కారణంగా ఇందరి ముందు అపరాధిని నిల్చోబెట్టినట్టు నిల్చోబెట్టావా? నీలో ఇముడ్చుకోరాదూ?" అని మౌనంగా తనలో తాను వాపోతున్నది కాత్యాయని. ఏమిటో ఈ సంసారం, ఈ మను

ష్యాలు, ఈ ప్రపంచం అంతా మాయగా అయోమయంగా గిరగిరా తిరుగుతూన్నట్లుకన్పిస్తున్నాయి కాత్యాయని కళ్ళకు.

అంతవరకు మౌనంగా పరిశీలిస్తూన్న ఉమాపతి ఇహ సహించలేకపోయాడు. అదివర కెవరూ కనీవినీ ఎరుగనంత ఉగ్రరూపం దాల్చాడు. "ఒరేయ్ దౌర్భాగ్యుడా. ఆగు !" వెళ్ళిపోతూన్న శ్రీనివాసరావు ఆ కేకకు మంత్రముగ్ధుడిలాగ ఠక్కున ఆగిపోయాడు.

"ఇలారా !" ఆజ్ఞానుబద్ధుడయి పిల్లిలా వచ్చి నిల్చున్నాడు. అతడికి ఊహాలూ, ఉద్దేశ్యాలూ అయితే చాలా వున్నాయిగాని, ఒక్కమాటలో చెప్పాలంటే అసమర్థుడు.తల్లిదండ్రుల ముందు పిల్లి అయిపోతాడు; పంచప్రాణాలతో నాలుగు ప్రాణాలు పనిజేయవు వారి ముందు.

"ఏదీ, తలెత్తి ఇటు చూడు." మరో ఆజ్ఞ జారీచేశాడు ఉమాపతి.

బలవంతంగా భయపడుతూ తలెత్తి తండ్రివంక చూశాడు శ్రీనివాసరావు.

"ఏదీ, ఇంతకుముందు వాగిన వాగుడు మళ్ళీ వాగు. ఆ పిల్ల మొద్దా ?" గద్దించి అడిగాడు కొడుకును.

మౌనంగా గ్రుడ్లప్పగించి చూడసాగాడు శ్రీనివాసరావు.

"మాట్లాడవేం ? రూపంలోనా, గుణంలోనా, విద్యలోనా— ఐశ్వర్యంలోనా? ఎందులో మొద్దుగా కన్పించిందిరా నీకు ? ఉరిమాడు ఉమాపతి.

"చదువుల్లో." భయపడుతూనే గొణిగాడు, ఎన్నో
చదువుతూన్న శ్రీను.

"మూర్ఖుడా !" అంటూనే చెంప ఛెళ్లు మనించాడు
ఉమాపతి.

"వద్దు మామయ్యా వద్దు. నా కారణంగా ఎవర్నీ
బాధ పెట్టవద్దు." బతిమాల్తూ ఖంగారుగా వచ్చి తండ్రీ
కొడుకు లిద్దరి మధ్యా నిల్చుంది కాత్యాయని కన్నీళ్లతో.

మరొకప్పుడైతే రుక్మిణి నానా రభసా చేసి వుండేది
కాని, కదుతోనే సాసేస్తున్న భర్త రౌద్రాకారం చూచి
కిమ్మనకుండా కళ్ళు వదిలేసి విస్మయపాటుతో తిలకించింది.

ఉమాపతి అన్నాడు. "ఈ యింటి పరిస్థితి నీకు తెలియ
దమ్మా కాత్యాయనీ. నువ్వు అన్నట్లే. ఈనాళ్ళ నీవు నాకు జ్ఞానో
దయం కలిగించావు" అంటూ ఉమాపతి కొడుకును చూచి,
కాత్యాయని ఈ యింటికే జ్యోతిరా నాన్నా. నా కొత్త
కాత్యాయనీ దేవే.

"నీకు విద్యావతి కావాలి. నాకు గుణవతి కావాలి. నీ
తల్లికి ఇంత డబ్బు తెచ్చిపోసి చాకిరీచేసే దేకావాలి. ఈ అన్ని
టితో బాటు మన మెవ్వరం కోరని సౌందర్యం కూడ
ఆమెలో వుంది నాకోడల్లా లక్ష్మీదేవివంటిపిల్ల. అవతార
మెత్తినా ఈ ప్రపంచంలో నీకు దొరకదు. తర్వాత తర్వాత
నీవే తెల్సుకొని సంతోషిస్తావు. ముందుగా చెప్తే నీ గయ్యాళి
తల్లి జరుగనియ్యదని గుట్టుగా కుదిర్చి చేశాను ఈ పెళ్ళి... కాని
నువ్వు నీతల్లినిమించినమూర్ఖుడవని అనుకోలేదురా చెప్తున్నాను,

ఒరేయ్ నాజమ్మా విను. గుండె చేత్తో గట్టిగా పట్టుకొని మరీ విను. ఈ కాత్యాయని – నీ భార్య బి.ఏ. ప్యాసైంది. సంగీతంలో సరస్వతి. యిప్పుడేమంటావు? ఏమంటావురా?" పళ్ళు పటపట లాడించేస్తున్నాడు ఉమాపతి.

ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసి నోటమాట లేకుండా చూస్తున్నాడు శ్రీనివాసరావు. రుక్మిణి అవస్థ సరేసరి – వర్ణనాతీతం.

మెల్లగా తేరుకొని, తలవాల్చి జవాబిచ్చాడు శ్రీనివాసరావు. "నన్ను క్షమించండి నాన్నా. నిజంగా మూర్ఖుడినే. ఇకనుండి బుద్ధిగా ప్రవర్తిస్తాను." తండ్రి కాళ్ళమీద వాలిపోయాడు.

"లేవరా, నాకు మాత్రం నీమీద కోపమా? నీసుఖం కాదూ నాక్కావలసింది?" అంటూ కొడుకును లేవనెత్తి "ఇటు చూడమ్మా కాత్యాయనీ," అని కోడలి కేసి తిరిగాడు.

అయోమయావస్థలో శిలా ప్రతిమలా నిల్చున్న కాత్యాయని మెల్లగా తలెత్తి మామగార్ని చూచింది; ఆమె నేత్రాల నిండా అశ్రువులు – దుఃఖబాష్పాలో, ఆనంద బాష్పాలో మరి!

ఉమాపతి మృదువుగా అన్నాడు. "నీ వంటి కోడలు ఇంటికి ఒక్కరున్నా ఈ ప్రపంచం స్వర్గతుల్య మౌతుంది కాత్యాయనీ. నాకు నీ మీద సంపూర్ణమైన విశ్వాసం, అపారమైన గౌరవం వున్నాయి.

"ఇదిగో, సర్వాధికారాలూ నీకు యిస్తున్నాను. ఈ కుటుంబ పరిస్థితి చూశావుగా? దీన్ని అన్నివిధాలా బాగు చేయడానికి ప్రయత్నించు." అంటూ ఉమాపతి జేబులోని తాళాల గుత్తి కాత్యాయనికి అందీయబోయాడు.

కలో నిజమో తెలియని పరిస్థితిలో కాత్యాయని అచేతనయై నిలబడింది.

"తీసుకో కాత్యాయనీ" చాలా మృదువుగా చెప్పాడు శ్రీనివాసరావు, వివాహమైన ఇన్నాళ్ళకు భార్యను సాదరంగా సంబోధించాడు. తాళాలు తీసుకుని, మామగారి పాదాలకు నమస్కరించింది కాత్యాయని.

"చూడు రుక్మిణీ. నిన్ను నీవు హీనపరచుకోకు గౌరవించి, గౌరవం పొందు. నీకు నీ పిల్లలు పసివాళ్ళయితే కోడలు మరొక తల్లికి పసిబిడ్డ గుర్తుంచుకో రా బయటికి." అంటూ నిష్క్రమించాడు ఉమాపతి.

ఇహ తన ఆటలు సాగవని గ్రహించి నిరాశ జేసుకున్న రుక్మిణి పుత్రికా మణులతో సహా భర్తననుసరించింది.

కాత్యాయనీ, శ్రీనివాసరావులు ఏకాంతంగా మిగిలారు.

"కాత్యాయనీ." మృదువుగా, మెల్లగా పిల్చాడు శ్రీనివాసరావు.

కాత్యాయని పలుకలేదు.

"కోపమా కాత్యాయనీ? ఈ మూర్ఖుడిని క్షమించలేవా?" దీనంగా అడిగాడు.

"హుఁ! క్షమ! ఎంతటి దారుణాలైనా ఈ ఒక్క రెండక్షరాల మాటలో సమసిపోతాయి; సర్వసాధారణమేగా? మీరు క్షమార్హులైనా కాకపోయినా, స్త్రీలు ఎప్పుడూ క్షమా హృదయులే" భర్త కళ్ళలోకి చూస్తూ అతి శాంత స్వరంతో పలికింది కాత్యాయని.

"నాన్నగారు చెప్పినట్లు నువ్వు నిజంగా ఈ యింటికీ నా జీవితానికీ జ్యోతివి కాత్యాయనీ. ఏ పొరపులూ, పొరపాట్లూ లేకుండా ఆదర్శదాంపత్యం గడపుదాం." అంటూ ఆమె మృదుహస్తాన్ని తన చేతిలోనికి తీసుకున్నాడు శ్రీనివాసరావు, "అధోగతిలోనున్న ఈ సంసారం నువ్వు అడుగు పెట్టినంతనే ఇంత ఉత్తమమార్గంలో పడడం ఎంత శుభ సూచకం!"

మౌనంగా, మృదువుగా నవ్వింది కాత్యాయని. కిటికీ చువ్వలగుండా లోనికి ప్రసరించి వారిపై కాంతిని నిలిపిన ఉదయభాస్కరుని బంగారు కాంతులు 'శుభమస్తు' అని దీవించి నట్లున్నాయి.

— సమాప్తం —